క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి: ఎస్పీ

వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 30: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో పరుగులు తీసే పోలీసులు అవి పక్కన పెట్టి ఆటలు ఆడేందుకు మైదానంలోకి దిగాలన్నారు. పోలీసులకు ఆటల పోటీలు నూతన ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

ఫుడ్ పాయిజన్‌పై ప్రభుత్వానికి పట్టింపు లేదా?

ఎస్ఎఫ్ఐ బంద్‌తో నర్సాపూర్‌లోని బడి నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

నర్సాపూర్, నవంబర్ 30: రాష్ట్రంలో పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌పై ప్రభుత్వానికి పట్టింపు లేదా అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ప్రశ్నించారు. శనివారం నర్సాపూర్‌లోని పాఠశాలలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తున్నా, సీఎం, అధికారులు, మంత్రులు సొంత ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులు ఇవ్వడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు సరఫరా చేసూ విద్యార్థుల మరణానికి కారణమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, అర్జున్, పవన్, కిరణ్, మహేందర్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

వంటగదిని పరిశీలిస్తున్న విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

రామాయంపేట, నవంబర్ 30: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం రామాయంపేట పురపాలికలోని కోమటిపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ మాడల్ స్కూల్‌ను పరిశీలించారు. పాఠశాలలోని స్టోర్‌రూమ్, వంట గది, విద్యార్థుల వసతి గదులు, రికార్డులను పరిశీలించి, ప్రిన్సిపాల్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్తీలేని ఆహారం, మెనూ ప్రకారం ఆహారాన్ని రోజూ అందించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, టీచర్లు ఉన్నారు.

అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మాట్లాడుతున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, నవంబర్ 30: అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద తెలిపారు. శనివారం జిల్లా న్యాయస్థానముల సముదాయంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల్లో రాజీ కుదుర్చుకునే పోలీస్ అధికారులు సహకరించాలని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ రక్షణపై విద్యార్థులకు అవగాహన

మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి

కౌడిపల్లి, నవంబర్ 30: కౌడిపల్లిలోని గురుకులంలో అడవికి నిప్పు మానవాళికి ముప్పు అనే అంశంపై ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి మాట్లాడుతూ చెట్లే మానవ మనుగడకు ఆధారమని, అడవుల మీద ఆధారపడి మానవాళి బతుకుతున్నదన్నారు. ఒక్క నిప్పురవ్వ దావానలంలా మారి వేల ఎకరాల్లోని చెట్లు కాలి బూడిదవుతున్నాయన్నారు. అడవుల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపన్యాస పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపాల్ నరసింహ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ భవానీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి యజమానికి చిక్కిన దొంగ

దొంగతనానికి వచ్చి చిక్కిన శ్రీనివాస్

చేగుంట, నవంబర్ 30: అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగతనానికి వచ్చిన వ్యక్తి ఇంటి యజమానికి చిక్కిన ఘటన నార్సింగిలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన శిర్న సంతోష్ నిజామాబాద్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యం ఉందని ఇంటికి తాళం వేసి వెళ్లాడు. అర్ధరాత్రి వేళ ఓ వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో ఇంటి యజమాని సంతోష్ తన దిచక్ర వాహనంపై ఇంటికి వచ్చాడు. ఇంట్లో నుంచి బయటకు వస్తున్న దొంగను పట్టుకున్నాడు. చుట్టుపక్కల వాళ్లని లేపి ఇంట్లో జరిగిన దొంగతనం గురించి తెలిపాడు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ దొంగతనానికి పాల్పడ్డాడని, ఈ విషయంలో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నార్సింగి ఎస్సై అహ్మద్ మొయినోద్దీన్ ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అంబులెన్సులోంచి ఆక్సిజన్ సిలిండర్ చోరీ


చోరీ అయిన ఆక్సిజన్ సిలిండర్

రామాయంపేట, నవంబర్ 30: పట్టణం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో అంబులెన్సులోంచి ఆక్సిజన్ సిలిండర్ చోరీ చేసిన ఘటన శనివారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని మద్దెల కృష్ణకు చెందిన అంబులెన్సును శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు కిరాయికి వెళ్లి డ్రైవర్ ఎప్పటిలాగే రోడ్డుపై పార్కు చేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూస్తే అంబులెన్స్‌లోని ఆక్సిజన్ సిలిండర్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో మద్దెల కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని తొలిగించవద్దు

మెదక్ రూరల్, నవంబర్ 30: అంబేద్కర్ విగ్రహం రోడ్‌కు అడ్డుగాలేదని, తొలిగించవద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి ప్రభాకర్ కోరారు. మండలంలోని పాతూరులో రోడ్ వెడల్పులో భాగంగా అంబేద్కర్ విగ్రహాన్ని తొలిగిస్తున్న ప్రదేశాన్ని శనివారం సందర్శించారు.

సీఎం హామీలు నిలబెట్టుకోవాలి

రామాయంపేటలో సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

నర్సాపూర్‌లో దీక్షా చేపట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- పేస్కేల్ విధానాన్ని అమలు చేయాలి
- సమగ్ర శిక్షా ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు
- డిమాండ్‌లను నెరవేర్చాలని నిరసన దీక్ష

రామాయంపేట, నవంబర్ 30: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో సమగ్ర శిక్షకుల సమస్యలు, ఉద్యోగ భద్రతను కల్పిస్తామని హామీని నిలబెట్టుకోక పోవడం విడ్డూరమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేట మండల వనరుల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్షలో మాట్లాడారు. తమ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా, నెరవేర్చక పోవడం పద్ధతి కాదన్నారు. సీఎం మొండి వైఖరి ప్రదర్శిస్తే మండల, జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, నవంబర్30: నర్సాపూర్ మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు ఒక్క రోజు నిరసన దీక్షా చేపట్టారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, నవంబర్ 30: శివ్వంపేట మండల వనరుల కేంద్రం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన దీక్ష చేపట్టారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం,నవంబర్ 30: మండలంలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

చేగుంటలో..

శివ్వంపేటలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

చేగుంట, నవంబర్ 30: సమగ్రశిక్షా ఉద్యోగులకు సీఎం ఇచ్చిన మాటను అమలు చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేగుంట ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద బైఠాయించారు. అనంతరం మండల విద్య వనరుల కేంద్రం వద్ద నిరసన దీక్ష చేపట్టారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, నవంబర్ 30: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి, పేస్కేల్ అమలుచేయాలని, జీవిత, ఆరోగ్య బీమా, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ అందించాలని కోరుతూ ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట కొనిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, నవంబర్ 30: విద్యాశాఖ– సమగ్ర శిక్షాలో ఏండ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేలు వేతనాన్ని అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, నవంబర్ 30: సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాపన్నపేటలోని ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన చేపట్టారు.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు ?

- గత ప్రభుత్వంలో నిధులు కేటాయించినా పనులు చేయరా?
- నిధులు మంజూరైన పనులపైనా నిర్లక్ష్యమా?
- ఎప్పడు పూర్తి చేస్తారని కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆవేదన

సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 30: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో నిర్మిస్తున్న వైకుంఠ ధామం, రాందాస్ చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని బీఆర్ఎస్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మున్సిపల్ సమావేశంలో ప్రశ్నించారు. పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను నిలదీశారు. శనివారం మెదక్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే 5వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులన్నీ నత్తనడక నడుస్తున్నాయన్నారు. ఇకనైనా అధికారులు మొద్దు నిద్ర విడనాడి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతున్నదని, పనులు పూర్తి చేయడంలో ఆలసత్వం ఎందుకని డీఈపై వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్‌కు రూ.49 లక్షల బిల్లులు చెల్లించారని, వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐడీఎస్ఎంటీ ఫేస్–2 ప్లాట్లను లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై దుకాణాలు పెడుతున్నారని, మిగిలిన కూరగాయలను డ్రైనేజీల్లో పారబోయడంతో కంపుకొడుతున్నాయని కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, మేఘమాల సభ దృష్టికి తెచ్చారు. రాందాస్ చౌరస్తా నుంచి దాయర వరకు రోడ్డు వెడల్పు పనుల్లో జాప్యం జరుగుతున్నదని కౌన్సిలర్ లింగం సభ దృష్టికి తేగా, త్వరలోనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కౌనిలర్లు జయరాజ్, ఆర్‌కె శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్, కిషోర్, షమి, దొంతి లక్ష్మి, గాయత్రి, కల్యాణి, షమీయోద్దీన్, జయశ్రీ, యశోధ, రుక్మిణి, వేదవతి, మమత, వనజ, కో ఆప్షన్ సభ్యుడు గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి: ఎంపీ

విజేతలకు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

రామాయంపేట విద్యార్థికి ద్వితీయ బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 30: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇన్స్‌ఫైర్– వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ముగింపు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో సైన్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి సమాజానికి ఉపయోగపడేలా మేధాసంపత్తితో దృష్టి సారించాలని సూచించారు. నేటి తరుణంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిందని, దానిమూలంగా రకరకాల అనర్థాలు చోటుచేసుకున్నాయని, వాటిని అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలకు మెమోంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేసేందుకు సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లకు డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయికి 19 ఎగ్జిబిట్లు ఎంపిక

రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి 19 ఎగ్జిబిట్లు ఎంపికయ్యాయి. సీనియర్ విభాగంలో 7 ఎగ్జిబిట్లు, జూనియర్ విభాగంలో 7 ఎగ్జిబిట్లు, ఉపాధ్యాయ విభాగంలో 1, ఇన్స్‌ఫైర్ విభాగంలో 4 ఎగ్జిబిట్లు ఎంపికయ్యాయి.

సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా ద్వితీయ బహుమతి

రామాయంపేట, నవంబర్ 30: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో రామాయంపేట తెలంగాణ మాడల్ స్కూల్ విద్యార్థి ద్వితీయ బహుమతి శనివారం అందుకున్నారు. అంజనీ ప్రసాద్ జామెట్రికల్ ఇన్స్‌ఫైర్ అండ్ సైన్సు ఫెయిర్ పోటీల్లో జిల్లా స్థాయిలో బహుమతి సాధించి ప్రతిభ చాటారు. మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, గైడ్ టీచర్ అరవింద్‌కుమార్, ఇతర టీచర్లు విద్యార్థిని అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నర్సాపూర్, నవంబర్ 30: నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తెలంగాణ సబ్ జూనియర్ అథ్లెటిక్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సెలక్షన్లు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం నిర్వహించారు. ఈ సెలక్షన్‌లో గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థుల్లో మనోహర్, సాయిచరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో వీరు పాల్గొంటారన్నా రు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్, పీడీ లక్ష్మణ్, పీఈటీ రాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మెదక్ జిల్లా రగ్బీ క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు వెళ్తున్న మెదక్ జిల్లా క్రీడకారులు

చేగుంట, నవంబర్ 30: చేగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నట్లు కోచ్ కరణం గణేశ్ రవికుమార్ శనివారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు తరలివెళ్లిందన్నారు. బాలికల జట్టులో లాస్య, కావ్య, ప్రవస్వీ, దేవి, కల్పన, విలక్షణ, శ్రావణ భార్గవి, నివేదిత, సాహితీ, శ్రావణి, అనురాధ, ఆశ్విత, బాలుర విభాగంలో బాలు, కార్తీక్, దీక్షిత్, నవదీప్, నందు, సాయితేజ, గణేశ్, సాయినయన్, శ్రీరామ్, శివకుమార్, నమృత్, టీమ్ కోచ్‌లుగా మల్లీశ్వరి, శ్రీనాథ్, టీమ్ మేనేజర్లుగా ప్రవీణ్, నర్సింహులు వ్యవరిస్తున్నారని పేర్కొన్నారు.

వ్యాధులను తరిమికొట్టాలి

శివ్వంపేట, నవంబర్ 30: వ్యాధులను తరిమికొట్టాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ బాలానగర్ ఎలైట్ 320బీ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం చిన్నగొట్టిముక్ల పంచాయతీలో చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 150 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజశేఖర్, మహేశ్, కత్తి భిక్షపతి, నర్సింలు, ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

మెదక్ రూరల్, నవంబర్ 30: మండలంలోని మక్తభూపతిపూర్, తిమ్మనగర్ గ్రామాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్, మెడిసిటీ దవాఖాన ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సుబాష్ చంద్రబోస్, దామోదర్‌రావు, సతీశ్‌రావు, మాజీ సర్పంచ్ నర్సింలు, సిద్దగౌడ్, యాదిరెడ్డి, సత్యనారాయణ, మెట్టు శ్రీను, శివయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

నర్సాపూర్, నవంబర్ 30: మండలంలోని రెడ్డిపల్లి, మంతూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి శాఖాధికారి సరస్వతి శనివారం సందర్శించారు. కొనుగోలు ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాలు, ధాన్యం మిల్లులకు తరలింపు, ట్యాబ్ ఎంట్రీ వివరాలను సమీక్షించారు. ఆమె వెంట జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరీశంకర్, సీసీ ప్రవీణ, సీఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 30: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 అకౌంటెంట్, 4 ఏఎన్ఎమ్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పోస్టులకు కావాల్సిన విద్యార్హతలు, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అర్హత గల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 7వ తేదీలోగా సమర్పించాలని, వివరాలకు 8985889663, 7893308762 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలి

నిజాంపేట, నవంబర్ 30: దేశాయి బ్రదర్స్ బీడీ కంపెనీలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు పనికి తగ్గ వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి డిమాండ్ చేశారు. శనివారం నిజాంపేటలో విలేకరులతో మాట్లాడుతూ దేశాయి బ్రదర్స్ బీడీ కంపెనీ పరిధిలో 47 బ్రాంచ్‌లు ఉన్నాయని, అందులో ఒక్కో బ్రాంచ్‌కు దాదాపుగా 50 నుంచి 100 మంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బీడీ కార్మికుల పొట్టగొడుతూ వెయ్యి బీడీలకు రూ.10 చొప్పున యాజమాన్యం కట్ చేస్తుందని మండిపడ్డారు. ఈ కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

గోవింద్ (ఫైల్)

చిలిపిచెడ్, నవంబర్ 30: ఉరేసుకుని స్కూల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్యతండాకు చెందిన గుగ్లోత్ శివరాం కుమారుడు గుగ్లోత్ గోవింద్ (16) జడ్పీహెచ్ఎస్ గౌతాపూర్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. 15 రోజులుగా స్కూల్‌కు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. స్కూల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. తల్లిదండ్రులు గమనించి కిందకు దించారు. అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి గుగ్లోత్ శివరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నూతన ఆలోచనలతో ముందుకు సాగాలి

మెదక్ రూరల్, నవంబర్ 30: మహిళలు నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని డైట్ ప్రిన్సిపాల్ రమేశ్, సఖీ కేంద్ర నిర్వాహకురాలు రేణుక అన్నారు. హవేళీఘనపూర్‌లోని డైట్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ, ఎస్‌డబ్ల్యూ ఎఆర్‌డీ, సఖీ కేంద్రం, పోలీస్‌శాఖ, సమన్వయంతో అవగాహన నిర్వహించారు. సఖీ పోస్టర్ ఆవిష్కరించారు.

కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలు

చేగుంట, నవంబర్ 30: ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన నార్సింగి మండలం శేరిపల్లి రహదారిలో శనివారం జరిగింది. ఎదురుగా వస్తున్న దిచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి బోల్తా పడింది. అందులో గాయపడిన వారిని మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మాల మహానాడు సభను విజయవంతం చేయాలి

కౌడిపల్లి, నవంబర్ 30: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల జనాభా ఉన్న తమకు అడుగడుగునా అన్యాయమే జరుగుతున్నదన్నారు. మాలల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. సమావేశంలో నాయకులు భూషణం, సంజీవులు, అనిల్, మహిపాల్, కుమార్, రత్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు

మెదక్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఈనెల 1 నుంచి 9 వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్డీవో భుజంగరావు సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ నెల 7, 8, 9వ తేదీల్లో గ్రామస్థాయి, 10 నుంచి 11వ తేదీల్లో మండల స్థాయి, 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సీఎం కప్ ఆటలపోటీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డీఈవో రాధాకిషన్ పాల్గొన్నారు.

3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

మెదక్ రూరల్, నవంబర్ 30: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఈనెల 3న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సర్వాపు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ ఎక్స్ రోడ్డు నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించి, స్టేడియం వద్ద వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

★బియ్యం, ధాన్యం, వడ్లు టన్నులు టన్నులు కొంటాం. మాది అతి పెద్ద రైస్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్. ధాన్యం, రైస్ వ్యాపారస్తులు & ఆల్ ఫుడ్ ఐటమ్స్ అమ్మేవారు, రైస్ మిల్లర్లు, మీడియేటర్స్, ఈ బిజినెస్‌లో పెట్టుబడి పెట్టే పార్టనర్స్ డైరెక్ట్: 8008251356.

NT-339341-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.